# పీజీఆర్ఎస్ ద్వారా పరిష్కరించిన అర్జీలపై లబ్ధిదారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడిన జిల్లా కలెక్టర్.

● ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ● ప్రతి అర్జీని నిబంధనలకు అనుగుణంగా సకాలంలో పూర్తిస్థాయిలో పరిష్కరించాలి. ● జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించి పరిష్కరించిన అర్జీలకు సంబంధించిన లబ్ధిదారులతో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. శనివారం కలెక్టర్ ఛాంబర్ నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కార ప్రక్రియపై కలెక్టర్ ఫోన్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించి పరిష్కరించిన అర్జీలకు సంబంధించి.... వారి సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారమయ్యాయా, అందించిన సేవలపై వారు సంతృప్తిగా ఉన్నారా అనే విషయాలను ఫోన్ ద్వారా నేరుగా అడిగి తెలుసుకుంటూ, పరిష్కారాల నాణ్యతను సమీక్షించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల కింద ఆర్థిక సహాయం తమ బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు సమర్పించిన తలారి రామయ్య, శ్రీమతి షేక్ మసుంబితో జిల్లా కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడారు. సంబంధిత అధికారుల చర్యల ఫలితంగా అన్నదాత సుఖీభవ పథకం కింద మంజూరైన ఆర్థిక సహాయం తమ బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు వారు జిల్లా కలెక్టర్‌కు తెలియజేస్తూ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వారు ప్రస్తుతం సాగు చేస్తున్న పంటల వివరాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకుని, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, వ్యవసాయ అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

అదేవిధంగా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, రెవెన్యూ శాఖలకు సంబంధించిన పలు అర్జీలపై కూడా సంబంధిత అర్జీదారులతో జిల్లా కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కార స్థితిని తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమస్య పరిష్కారమైన వెంటనే సంబంధిత అర్జీదారులకు స్వయంగా సమాచారం అందించి, వారి సంతృప్తిని నిర్ధారించడంతో పాటు ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించేందుకు అధికారులు కట్టుబడి పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## బిసి ఐక్యతా వాది కుమ్మర కుల జాతిపిత కీర్తి శే జాలిగామ ఈశ్వరయ్య

హైదరాబాద్. జూలై 25. (నంది పత్రిక ):బిసిసమాజిక ఆర్థిక వికాసానికి ఐక్యతకు కుమ్మర



సామాజిక వర్గం సామాజిక ఆర్థిక అభివృద్ధికి హక్కుల సాధనకు జీవితాంతం కృషిచేసినసామాజికవిప్లవకారుడు కుమ్మర జాతి పిత దివంగత జాలిగామ ఈశ్వరయ్య అని వారి సేవలను నేదునూరి కనకయ్య కొనియాడారు.నేడు కీర్తి శే జాలిగామ ఈశ్వరయ్య 93వ జయంతి వేడుకలు తెలంగాణ రాష్ట్రీయ కుమ్మర సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు ధరిపెల్లి మహేందర్ అధ్యక్షతనలికుమ్మర విద్యార్థుల వసతి గృహం సరూర్నగర్ లో అత్యంత ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి కుమ్మర సంఘం నాయకులు మేధావులు యువకులు పెద్ద సంఖ్యలో హాజరై ఈశ్వరయ్య గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జరిగిన చర్చా వేదికలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ కుమ్మర సంఘం 880/2014 రాష్ట్ర అధ్యక్షులు ప్రముఖ పత్రిక రచయిత కాలమిస్ట్ తెలంగాణ ఎకనామిక్ ఫోరం అధ్యక్షుడు నేదునూరి కనకయ్య మాట్లాడుతూ జాలిగా మహేశ్వరయ్య ఆశించిన విధంగా కుమ్మర సామాజిక వర్గం రాజకీయంగా ఎదగాలని చట్టసభల్లో కుమ్మర్ల జనాభాకు తగిన ప్రాతినిధ్యం దక్కించుకోవడానికి క యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కుమ్మరి కులస్తులు ఆర్థికంగా అభివృద్ధి చెంది విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలని వారి సామాజిక అభివృద్ధికి ప్రభుత్వాలు హాస్టల్లో స్కాలర్షిప్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రధానవక్త గా పాల్గొన్న తెలంగాణ కుమ్మర సంఘం 880/2014రాష్ట్ర ప్రధాన కార్యదర్శి 'తెలంగాణ రాష్ట్ర కుమ్మర ఆత్మ గౌరవ భవన్ ఉపాధ్యక్షులు కొల్లూరు అనిల్ కుమార్ మాట్లాడుతూ సాంప్రదాయ కుమ్మర వృత్తిని నమ్ముకున్న కుటుంబాలను ఆదుకోవడానికి కుండలు తయారు చేయడానికి ఉచితంగామట్టి సేకరించడానికి మట్టి పాత్రలు కాల్చడానికి వృతి మీదవేసేపన్నునుమినహాయించడానికిప్రభుత్వ జి వో లను సాధించడంలో ఈశ్వరయ్య చేసిన సేవలు చిరస్మరణీయం అనిఅన్నారు.ప్రభుత్వంకుమ్మరి వృత్తికి ఆధునిక సాంకేతికతను జోడించాలని కుమ్మర్ల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం రుణ సదుపాయాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విద్యా ఉద్యోగ ఉపాధి పరంగా వెనుకబడిన కుమ్మరి కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కుమ్మర్ల హక్కుల రక్షణే ధ్యేయంగా కుమ్మర కులస్తుల చైతన్యమే లక్ష్యంగా నిరంతరం పనిచేసి సమాజ సేవలో అమరులైన వారి ఆశయాల సాధనకు కృషి చేయడమే వారికి ఈ తరం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.తెలంగాణ రాష్ట్ర కుమ్మర ఆత్మ గౌరవ భవన్ సభ్యులు అశోక్ మాట్లాడుతూ జాలిగామామ ఈశ్వరయ్య కుమ్మర సంఘం కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించి పేద కుమ్మర వృత్తిదారుల్లో ఐక్యతను సౌహార్థత తను కుమ్మర హక్కుల పట్ల చైతన్యం కల్పించిన చైతన్య శక్తి ఈశ్వరయ్య ని అన్నారు.

## భారత క్రీడారంగానికి పెరుగుతున్న డోపింగ్ ముప్పు

పల్లె వెలుగు:క్రీడల్లో విజయం అనేది ప్రతిభ, కఠోర శ్రమ, క్రమశిక్షణ, మానసిక దృఢత్వానికి ప్రతీక. అయితే ఇటీవల భారత క్రీడారంగంలో పెచ్చుపెరుగుతున్న డోపింగ్ భూతం ఈ ఉత్కృష్ట విలువలన్నింటినీ తీవ్రంగా ప్రశ్నార్థకంచేస్తోంది.అంతర్జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) విడుదల చేసిన నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న డోపింగ్ ఉల్లంఘనల్లో భారత్ అత్యంత ఆందోళనకరమైన స్థానంలో కొనసాగుతోంది. 2022లో 127 కేసులతో ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలిచిన భారత్, 2023 నివేదికలోనూ 201 కేసులతో అగ్రస్థానంలో నిలవడం మన క్రీడా వ్యవస్థలోని లోతుపాతులను బహిర్గతం చేస్తోంది. కేంద్ర క్రీడాశాఖ మంత్రి వెల్లడించిన అధికారిక వివరాల ప్రకారం, 2026 జూలై 15 నాటికే దేశంలో 78 డోపింగ్ ఉల్లంఘనలు నమోదు కావడం, ముఖ్యంగా పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాల్లో కేసుల సంఖ్య విపరీతంగా ఉండటం సమస్య తీవ్రతకు నిదర్శనం. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) నిర్వహించిన పరిక్షల్లో గ్రామీణ, జూనియర్ స్థాయి క్రీడాకారులు కూడా భారీగా పట్టుబడటం, అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య డేటా ప్రకారం భారత్‌కు చెందిన వందలాది మంది అథ్లెట్లు నిషేధానికి గురికావడం కేవలం చట్ట ఉల్లంఘన మాత్రమే కాదు; భారత క్రీడారంగ విశ్వసనీయతకు, భావి భారత క్రీడాకారుల భవిష్యత్తుకు ముప్పుగా మారింది.డోపింగ్ అంటే క్రీడాకారుడు తన శారీరక సామర్థ్యాన్ని కృత్రిమంగా పెంపొందించుకునేందుకు నిషేధిత మందులు, అనాబాలిక్ స్టెరాయిడ్లు లేదా రసాయనాలను వినియోగించడం. తాత్కాలికంగా శారీరక శక్తి, వేగం, ఓర్పు పెరిగినట్లు కనిపించినప్పటికీ, దీర్ఘకాలంలో ఇవి ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావాన్ని చూపుతాయి. గుండెపోటు, అకస్మాత్తుగా కాలేయం, మూత్రపిండాలు వైఫల్యం చెందడం, తీవ్రమైన హార్మోన్ల అసమతుల్యత, తీవ్ర మానసిక ఒత్తిడి వంటి ప్రమాదాలు ఎదురవుతాయి. అంతేకాదు, ఒక్కసారి డోపింగ్‌లో పట్టుబడితే క్రీడాకారుడి దశాబ్దాల కష్టం, ప్రతిష్ఠ, దేశం తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశాలు శాశ్వతంగా కాలిపోతాయి.డోపింగ్‌కు ప్రధాన కారణాల్లో తీవ్రమైన పోటీ, తక్కువ సమయంలో నకిలీ విజయాలు సాధించాలనే ఆతృత, సరైన అవగాహన లేకపోవడం, కోచింగ్ వ్యవస్థలోని నైతిక లోపాలు, నిపుణుల పర్యవేక్షణ లేకుండా విచ్చలవిడిగా లభించే పోషకాహార సప్లిమెంట్ల వినియోగం ముఖ్యమైనవి. దాదాపు 70 శాతం మంది అథ్లెట్లు తాము తీసుకుంటున్న సాధారణ మందులలో లేదా సప్లిమెంట్లలో నిషేధిత పదార్థాలు ఉన్నాయనే విషయాన్ని గమనించకుండానే బలైపోతున్నారు. మరికొందరు క్రీడాసంఘాల ఒత్తిడికి లోనై ఉద్దేశపూర్వకంగా డోపింగ్‌కు పాల్పడుతున్నారు. ఈ రెండు పరిస్థితులూ సమానంగా ఆందోళనకరమే.ఈ మహమ్మారిని కేవలం కఠిన శిక్షలతో మాత్రమే నియంత్రించడం సాధ్యం కాదు. పాఠశాల స్థాయి నుంచే అకాడమీలు, క్రీడా ప్రాధికార సంస్థల్లో డోపింగ్‌పై శాస్త్రీయ అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలి. ప్రతి క్రీడాకారుడికి నిషేధిత పదార్థాల జాబితా, సురక్షిత ఔషధాల వినియోగంపై స్పష్టమైన శిక్షణ అందించాలి. కోచ్‌లు, ఫిజియోథెరపిస్టులు, వైద్యులను కూడా ఇందులో చట్టరీత్యా బాధ్యులను చేయాలి. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యంత పారదర్శకంగా, అత్యాధునిక సాంకేతికతతో నాడా ద్వారా విస్తృత పరీక్షలు నిర్వహించాలి.భారత్ ప్రపంచ క్రీడా శక్తిగా ఎదగాలంటే పతకాల సంఖ్యతో పాటు నైతిక విలువలను కూడా కాపాడుకోవాలి. విజయం నిషేధిత మందుల సీసాల్లో లభించదు, అది కేవలం నైతిక శ్రమతోనే సాధ్యమవుతుంది. స్వచ్ఛమైన క్రీడా సంస్కృతి నెలకొన్నప్పుడే భారత క్రీడాకారుల విజయాలకు అంతర్జాతీయ వేదికలపై నిజమైన గౌరవం దక్కుతుంది. డోపింగ్‌కు వ్యతిరేకంగా క్రీడాకారులు, శిక్షకులు, సంస్థలు, తల్లిదండ్రులు సమష్టిగా పోరాడితేనే పారదర్శకమైన క్రీడా భవిష్యత్తు నిర్మాణం సాధ్యమవుతుంది.అంతర్జాతీయ వేదికలపై భారత జాతీయ పతాకం సగర్వంగా ఎగరాలంటే 'జీరో టాలరెన్స్ టు డోపింగ్' అనే సూత్రం ప్రతి క్రీడా మైదానంలో ఆచరణలోకి రావాలి. కేవలం పతకమే పరమావధిగా కాకుండా నైతిక విలువలతో కూడిన విజయాన్ని ఆస్వాదించే సంస్కృతిని చిన్నప్పటి నుంచే నరనరాన నూరిపోస్తేనే, భారత క్రీడారంగం విశ్వసనీయంగా, ప్రపంచానికే ఆదర్శప్రాయంగా రూపుదిద్దుకుంటుంది. (హెచ్.ప్రతాప్)

## పీజీఆర్ఎస్ అభిప్రాయ సేకరణకు ప్రాధాన్యం.

**మెప్మా పీడీ వెంకటదాస్.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రజలకు అందిస్తున్న సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడం, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సమర్థవంతంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)పై అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని



చేపట్టినట్లు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటదాస్ తెలిపారు. ఈ మేరకు శనివారం మెప్మా కార్యాలయంలో పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్‌కు సంబంధించిన క్యూ ఆర్ కోడ్‌తో కూడిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటదాస్ మాట్లాడుతూ, పీజీఆర్ఎస్ ద్వారా ప్రజలు అందించిన ఫిర్యాదుల పరిష్కారంపై తమ అభిప్రాయాలను క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సులభంగా నమోదు చేయవచ్చన్నారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు, అభిప్రాయాలు ప్రభుత్వ సేవల నాణ్యతను పెంపొందించడంలో కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ అభిప్రాయాలను నమోదు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా కమ్యూనిటీ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## అమృత్-2 పనులకు సోమవారం భూమిపూజ.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. అమృత్-2 పథకం కింద ఈ నెల 27న సోమవారం



నంద్యాలలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 9 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అనంతరం నూతన మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టీపీ), చిన్న చెరువు కట్ట అభివృద్ధి పనులు, మహానంది రోడ్డులోని హెడ్ వాటర్ వర్క్సులో తాగునీటి సరఫరా పనులకు భూమిపూజలు నిర్వహిస్తారు.

ఈ కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి, జిల్లా ప్రత్యేకాధికారి రాజకుమారి గణియా హాజరవుతారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులు తప్పక పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిషనర్ బండి శేషన్న కోరారు.

## గాజులపల్లెలో చిన్నారుల పీర్ల పండగ సందడి





మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం గాజులపల్లె మెట్టలో చిన్నారులు పీర్ల పండగ వేడుకలు అంబరాన్ని అంటాయి. మొహరం పండగ ముగిసిన చిన్నారులు తమదైన శైలిలో ముచ్చటగా పీర్లను తామే స్వయంగా తయారు చేశారు. మూడు రోజుల క్రితం తప్పెట్లు వాయిస్తూ పీరును గాజులపల్లె గ్రామం అంతా ఊరేగించారు. నేడు జియారత్ వేడుకలను తమ స్వతహాగా చందాలను స్వీకరించి అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలన్నీ గ్రామంలోని పెద్దలను ఆకట్టుకుంటున్నాయి.

## గాజులపల్లెలో తొలి ఏకాదశి పూజలు



మహానంది, పల్లె వెలుగు మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు శనివారం జరుగుతున్నాయి. ప్రత్యేక అలంకరణలో స్వామి



అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా అర్చకులు స్వామివారికి అభిషేక అర్చనలు నిర్వహించారు.తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో సందడి నెలకొంది. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

